క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామి హుండీ లెక్కింపు


హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

భీమవరం (ప్రకాశంచౌక్): జువ్వలపాలెం రోడ్డులో వేంచేసియున్న శ్రీపద్మావతి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం హుండీలను లెక్కించారు. 147 రోజులకుగాను రూ.9,51,157 ఆదాయం వచ్చిందని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. కార్యక్రమంలో మంతెన రామ్‌కుమార్‌రాజు, డీవీ కృష్ణంరాజు, ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

కంప్యూటర్ల బహూకరణ


మావుళ్లమ్మ దేవస్థానానికి కంప్యూటర్లు అందిస్తున్న బ్యాంకు సిబ్బంది

భీమవరం (ప్రకాశంచౌక్): మావుళ్లమ్మ దేవస్థానానికి భీమవరం స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్ రూ.1,20,000. విలువ చేసే రెండు కంప్యూటర్లను అందజేశారు. వీరికి ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. బ్యాంకు రీజనల్ మేనేజర్ గురవయ్య, చీఫ్ మేనేజర్ శ్రీనివాస్‌రాజు, బ్యాంకు సిబ్బందికి ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీ నగేష్ శేష వస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

కేవీకే శాస్త్రవేత్తకు డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న కేవీకే శాస్త్రవేత్త బిందు ప్రవీణ

ఉండి: టిష్యూ కల్చర్ విధానంలో ద్రాక్షలో నీటి ఎద్దడిని తట్టుకునే రకాలపై కేవీకే శాస్త్రవేత్త ఆర్.బిందుప్రవీణ భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఆదివారం దేశ రాజధాని న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఆధ్వర్యంలో, వ్యవసాయశాఖ, రైతు సంక్షేమశాఖ సహాయ మంత్రులు భగీరథ చౌదరీ, రామనాథ్ ఠాగూర్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నట్లు సోమవారం పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మల్లిఖార్జునరావు, కేవీకే శాస్త్రవేత్తలు, సిబ్బంది ఆమెను అభినందించారు.

రౌడీ షీటర్ల బైండోవర్

భీమవరం: పట్టణానికి చెందిన ఐదుగురు రౌడీ షీటర్లను బైండోవర్ చేశామని టూటౌన్ సీఐ కాళీచరణ్ తెలిపారు. డి.శ్రీకాంత్, బి.నరేష్, జి.ఉదయ్‌కుమార్, టి.డేవిడ్, పి.శ్రీనివాస కిరణ్‌కుమార్‌ను అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా ఆరు నెలలకోసారి బైండోవర్ చేస్తామన్నారు. వారిని తహసీల్దార్ ఎదుట హాజరు పర్చగా రూ.5 లక్షలు పూచీకత్తు తీసుకున్నారని తెలిపారు.

చెరువుల అక్రమ తవ్వకాలు ఆపాలి


ఆందోళన చేస్తున్న దిరుసుమర్రు గ్రామస్తులు

భీమవరం: శ్మశానవాటిక పక్కన అక్రమంగా రొయ్యల చెరువు తవ్వుతున్న వారిపై చర్యలు తీసుకొని నిలుపుదల చేయాలని భీమవరం మండలం దిరుసుమర్రు గ్రామానికి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చిన గ్రామస్తులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. శ్మశాన వాటికకు వెళ్లే మార్గాన్ని రైతులు కూడా వినియోగించుకుంటారు. అయితే గ్రామానికి చెందిన గూడపాటి శాంతారావు తన భూమిలో పంట కాలువ, శ్మశాన వాటికకు వెళ్లడానికి లేకుండా చెరువు తవ్వుతున్నారని దీనిపై రెవెన్యూ అధికారులకు పిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మైగాపుల గంగారామ్, గవర రాజబాబు, నక్కా రామోజీరావు, కెల్లా జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడిగా కిరణ్‌ప్రసాద్


నల్లా సత్యకిరణ్ ప్రసాద్

ఉండి: విశ్వ హిందూ పరిషత్ జిల్లా నూతన అధ్యక్షుడిగా ఉండికి చెందిన నల్లా సత్యకిరణ్ ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆదివారం పాలకోడేరు మండలం విస్సాకోడేరులో నిర్వహించిన సమావేశంలో ఈ ఎన్నిక జరగగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

సామర్థ్యం పెంపుతో విద్యుత్ సమస్యలకు చెక్

- విద్యుత్ సబ్ స్టేషన్ల కెపాసిటీ పెంచాలి
- పెరుగుతున్న లోడు–వేసవిలో మరింత గోడు


విద్యుత్ సబ్ స్టేషన్

ఆకివీడు: విద్యుత్ వినియోగం రోజు రోజుకూ పెరగడంతో పాటు, వేసవిలో మరింత అదనపు లోడుతో ప్రస్తుత సబ్‌స్టేషన్ల సామర్థ్యం సరిపోయే పరిస్థితి కన్పించడం లేదు. పలు సబ్ స్టేషన్లలో 5 ఎంవీఏలు, 8 ఎంవీఏల సామర్థ్యంతో ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. వీటి సామర్థ్యాన్ని మరింతగా పెంచడం వలన నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుంది. ఉండి నియోజకవర్గంలో ఇటీవల రొయ్యల చెరువుల వినియోగం, ఐస్ ఫ్యాక్టరీలు, ఇతర పరిశ్రమల వినియోగం అధికమైంది. నియోజకవర్గంలో ఇప్పటి వరకూ 17 సబ్ స్టేషన్లు, 220 కేవీ సబ్‌స్టేషన్లు రెండు ఉన్నాయి. సబ్ స్టేషన్లలో సామర్థ్యం పెంచేందుకు 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు అధికంగా ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రతి సబ్‌స్టేషన్‌లో 8 ఎంవీఏల స్థానంలో మరొకటి, 5 ఎంవీఏ స్థానంలో మరో 8 ఎంవీఏ లేదా 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలి. ఇప్పటికే ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో మెగా ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు గత ప్రభుత్వంలోనే ప్రతిపాదనలను సంబంధిత ట్రాన్స్‌కో అధికారులు ప్రభుత్వానికి పంపారు.

కోట్లాది రూపాయల ఆదాయం

జిల్లాలో ఉండి నియోజకవర్గంలో విద్యుత్ వినియోగం ద్వారా ప్రభుత్వానికి రూ.కోట్ల ఆదాయం లభిస్తుంది. ఆక్వా రంగంతో పాటు అనుబంధ పరిశ్రమలు, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు విద్యుత్ వినియోగం అధికంగా ఉంది. నియోజకవర్గంలో గృహావసరాలు, గృహేతర అవసరాలు, ఆక్వా, వ్యవసాయ రంగాల్లో మొత్తం 1,07,000 వరకూ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుత వినియోగంలో కొంత మేర సామర్థ్యం సరిపోతున్నా, వేసవిలోనూ, ఇతరత్రా సమయాల్లో విద్యుత్ సరఫరాలో నాణ్యమైన విద్యుత్ అందడంలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అన్ని సబ్ స్టేషన్లలో 8 ఎంవీఏ మెగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చాల్సి ఉంది. నియోజవర్గంలోని నాలుగు మండలాల్లో సరాసరిగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి.

మరో ఏడు సబ్‌స్టేషన్లు అవసరం

నియోజకవర్గలోని విద్యుత్ వినియోగాన్ని బట్టి మరో ఏడు సబ్ స్టేషన్ల ఏర్పాటు అవసరం ఉంది. గత ప్రభుత్వంలో యండగండి, గొల్లలకోడేరు, గుమ్ములూరు, తాళ్లకోడులో కొత్త సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా ప్రస్తుతం విద్యుత్ శాఖ అధికారుల నుంచి పెదకాపవరం, కోనలపల్లి, కొండేపూడితో పాటు మరో మూడు గ్రామాల్లో సబ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. ఏలూరుపాడులో సబ్‌స్టేషన్ మంజూరు చేయాల్సి ఉంది.

నియోజకవర్గంలో	సబ్ స్టేషన్లు	కనెక్షన్లు	ప్రతిపాద నలు
ఆకివీడు	5	26,900	01
ఉండి	3	23,200	01
కాళ్ళ	5	28,400	01
పాలకోడేరు	4	28,500	04

ప్రతిపాదనలు పంపాం



ఏడీఈ పరిధిలో ఆకివీడు ఉంది. ఆకివీడు, కాళ్ల మండలాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లలో ఎనిమిది ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడానికి పత్రిపాదనలు పంపాం. సబ్‌స్టేషన్లలో సామర్థ్యం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గతంలో కొన్ని మంజూరయ్యాయి. మరికొన్ని మంజూరు అవ్వాలి.

–యు.శ్రీనివాసరావు, ఆకివీడు

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ధర్నా


ధర్నా చేస్తున్న దళిత సంఘాల నాయకులు

భీమవరం: కూటమి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ డిమాండ్ చేశారు. సోమవారం భీమవరం అంబేడ్కర్ సెంటర్‌లో దళిత జేఏసీ, మాల మహానాడు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ప్రభుత్వం కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని, వెంటనే ఆ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై ఏకపక్షంగా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఇది సమంజసం కాదని, మాలలపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టిందని మంగరాజు ఆరోపించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వర్ధనపు మోషే, బిరుదుగడ్డ రమేష్‌బాబు, కేసీ రాజు, కర్రి జోగయ్య, విప్పర్తి ప్రభాకర్, బండారు బాల సుందరం, గుజ్జుల నిరీక్షన్, గొల్ల రాజ్‌కుమార్, పెట్టెం శుభాకర్, గాతల సందీప్, తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో అన్ని వర్గాలకూ అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న ఉమా మహేశ్వరరావు

భీమవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఉద్యోగులు, కార్మికులు, స్కీం వర్కర్లు, అన్ని వర్గాలకు అన్యాయం చేశారని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమా మహేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం భీమవరంలోని ప్యాడి అండ్ రైస్ మర్చంట్ హాలులో ఏర్పాటు చేసిన సీఐటీయూ జిల్లా కౌన్సిల్ సమావేశాలను ప్రారంభించి మాట్లాడారు. వేతన జీవులకు నెలనెలా వేతనాలు అందించడంలో ఆయా డిపార్ట్‌మెంట్లలోని పెండింగ్ బిల్లులు క్లియర్ చేయడానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. కాని గత బడ్జెట్‌లో కేటాయించిన నిధులకు కోత విధిస్తూ గొప్ప బడ్జెట్లు అంటూ పాలకులు గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు.

మేడే కార్యక్రమాలు

మేడే రోజున ఎనిమిది గంటల పని హక్కును కాపాడుకుందాం అనే నినాదంతో కార్యక్రమం నిర్వహించనున్నామని ఉమా మహేశ్వరరావు చెప్పారు. అలాగే కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా కేంద్ర కార్మిక సంఘాలు మే 20వ తేదీన దేశ వ్యాప్త సమ్మె చేయాలని నిర్ణయించాయన్నారు. కార్యక్రమంలో జెఎన్‌వీ గోపాలన్, కె.రాజా రామ్మోహన్‌రాయ్, పీవీ ప్రతాప్, సూర్నీడి వెంకటేశ్వరరావు, టి.సత్యనారాయణ, ఎస్.రంగారావు, కె.ఝాన్సీలక్ష్మి, ఎండీ హసీనా, డి.జ్యోతి, ఎం.త్రిమూర్తులు, జవ్వాది శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

12 గ్యాస్ సిలిండర్ల స్వాధీనం


సిలిండర్లను స్వాధీనం చేసుకుంటున్న సీఎస్‌డీటీ మహేష్

ఉండి: సెంటర్‌లోని హోటల్స్‌లో అక్రమంగా వినియోగిస్తున్న 12 గ్యాస్ సిలిండర్లను సివిల్ సప్లై అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ మోరంపూడి మహేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం హోటల్స్, దుకాణాలపై దాడులు నిర్వహించామని తెలిపారు. ఈ దాడుల్లో గృహావసరాలకు వినియోగించాల్సిన గ్యాస్ సిలిండర్లను వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్న ఉండి సెంటర్‌లోని నెల్లూరు హోటల్ వద్ద నుంచి 8 సిలిండర్లు, సమోసా తయారీ దుకాణం నుంచి ఒకటి, హరిప్రియ స్వీట్‌షాపు నుంచి 3 చొప్పున మొత్తం 12 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై 6ఏ కేసు నమోదు చేసి గ్యాస్ సిలిండర్లను స్థానికంగా ఉన్న గ్యాస్ ఏజెన్సీకి తరలించినట్లు తెలిపారు. దీనిపై పూర్తి వివరాలను జాయింట్ కలెక్టర్‌కు అందించనున్నట్లు సీఎస్ డీటీ తెలిపారు.

ఉగాది వేడుకల్లో విద్యార్థులకు పోటీలు


ఉగాది వేడుకల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

భీమవరం: పట్టణంలోని విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉగాది వేడుకల్లో భాగంగా భగవద్గీత భారతీయ సంస్కృతి సంప్రదాయాలు–పండుగలు అనే అంశంపై సోమవారం బార్డోలి స్కూల్‌లో వ్యాస రచన, తెలుగు పద్యాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్నర్ వీల్ క్లబ్ కార్యదర్శి గంధం శ్రీదేవి మాట్లాడుతూ బాలల్లో దేశ భక్తి మన సంస్కృతి సాంప్రదాయాలు తెలియజేస్తూ ఇటువంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ విద్యార్థులకు వేమన దాశరథి సుమతీ శతకాల పద్య పోటీలు, తెలుగు సంప్రదాయాలు పండుగలపై వ్యాస రచన పోటీలు నిర్వహించామని పోటీల్లో విజేతలకు, 30న ఉగాది వేడుకల్లో బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.మహాలక్ష్మి, జి.శ్రీలక్ష్మి, టి.ఉమాశంకర్, కె.సుజాత, ఎం.రజిని, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ జిల్లా రెండో గవర్నర్‌గా రాజు


సూర్యనారాయణరాజును అభినందిస్తున్న లయన్స్ మాజీ గవర్నర్

ఆకివీడు: విశిష్ట సేవలందిస్తూ లయినిజంలోనే మంచి గుర్తింపు పొంది అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రతిష్టలు పొందిన ఆకివీడు లయన్స్ క్లబ్‌కు మరో విశిష్ట పదవి దక్కింది. లయన్స్ జిల్లా రెండో గవర్నర్‌గా లయన్ ఆర్‌వీ సూర్యనారాయణరాజు (ఆర్‌వీఎస్ రాజు) ఎన్నికయ్యారు. ఏలూరులో ఆదివారం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన లయన్స్ జిల్లా గవర్నర్ ఎన్నికల్లో రెండో గవర్నర్ పదవిలో ఆయన గెలుపొందారు. ఈ సందర్భంగా స్థానిక లయన్స్ క్లబ్ కార్యాలయంలో సోమవారం ఆర్వీఎస్.రాజును లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ సూర్యనారాయణరాజు, లయన్స్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ గొంట్లా కృష్ణమూర్తి, ఆదర్శ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కాకర్ల రాజరాజేశ్వరి, మోరా జ్యోతిరెడ్డి, సన్నిధి వెంకన్నబాబు, వీవీ కృష్ణంరాజు, నేరెళ్ల చెంచయ్య, శ్రీనివాసరాజు, బాబు, సత్యనారాయణ, గుర్రం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షకు 513 మంది గైర్హాజరు

భీమవరం: జిల్లాలో సోమవారం నిర్వహించిన టెన్త్ పబ్లిక్ గణిత పరీక్షకు 513 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 23,146 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 22,633 మంది హాజరయ్యారన్నారు. 63 పరీక్షా కేంద్రాల్లో ఫ్లైయింగ్ స్క్వాడ్, జిల్లా స్థాయి పరిశీలకులు డీఈవో తనిఖీలు చేయగా ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈవో నారాయణ తెలిపారు.

12 మంది గైర్హాజరు

కాళ్ల: మండలంలో సోమవారం నిర్వహించిన గణిత పరీక్షకు 12 మంది గైర్హాజరయ్యారు. కాళ్ల హైస్కూల్‌లో 210 మంది, కోపల్లెలో 201 మందికి గాను ముగ్గురు, కలవపూడిలో 109 మందికిగాను ఆరుగురు, ఏలూరుపాడు జెడ్పీ హైస్కూల్‌లో 203 మందికిగాను ముగ్గురు విద్యార్థులు చొప్పున మొత్తం 12 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖాధికారి ఎ.రవీంద్ర తెలిపారు. మండలం మొత్తం 723 మంది హాజరుకావాల్సి ఉండగా 711 మంది గణిత పరీక్ష రాశారు. 98.34 శాతం హాజరు నమోదైందని తెలిపారు.

పాలకోడేరులో 19 మంది

పాలకోడేరు: సోమవారం జరిగిన పదో తరగతి గణితం పరీక్షకు మండల వ్యాప్తంగా 19 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని మండల విద్యాశాఖ అధికారి పెనుమత్స వెంకట శివ నాగరాజు తెలిపారు. మండల వ్యాప్తంగా 605 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా 586 మంది విద్యార్థులు హాజరై, 19 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. సెంటర్ల వారీగా గొల్లలకోడేరు పాఠశాలలో నలుగురు, పాలకోడేరు పాఠశాలలో ఒకరు, శృంగవృక్షంపాఠశాలలో నలుగురు మోగల్లు పాఠశాలలో పది మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం


క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

భీమవరం (ప్రకాశంచౌక్): జాతీయ క్షయ వ్యాధి నిర్మూలనా దినోత్సవం డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ గీతా భాయ్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ బి.భాను నాయక్ అధ్యక్షతన భీమవరం ఏరియా హాస్పిటల్‌లో నిర్వహించారు. అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించి క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్ ప్రోగ్రాం కింద రోగులకు పౌష్టికాహార పంపిణీ చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్, ఏరియా హాస్పిటల్స్, అర్బన్ హెల్త్ సెంటర్స్ మొత్తం 61 సెంటర్లలో కఫం పరీక్షలు చేస్తున్నారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ వి.మాధవి కల్యాణి, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం అర్బన్: భీమవరం పట్టణంలో టిడ్కో ఇండోర్ విద్యుత్ ఉప కేంద్రం నుంచి మండలంలోని పెదగరువు వెళ్లే లైన్లపై వార్షిక మరమ్మత్తులు నిమిత్తం మంగళవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. తాడేరు ఇండస్ట్రియల్ లైన్, తాడేరు, యమునాపల్లి, కొత్రపాడు, బేతపూడి, కరుకువాడ, పెదగరువు, చినగరువు, రాజులగరువు, వెంప, శ్రీరామపురం, తుందుర్రు, జొన్నలగరువు గ్రామాలతో పాటు వీరవాసరం మండలంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

చివరిలో చీడ పీడల బెడద


దాళ్వా వరి చేను

వీరవాసరం: దాళ్వా సాగులో రైతాంగం చీడ పీడల బెడదతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. వీరవాసరం మండలంలో 16 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఎంటీయూ 1061, 1064, సంపద, కొద్ది మోతాదులో స్వర్ణ రకాలను సాగు చేశారు. ప్రస్తుతం మండలంలోని వరి చేలు పక్వానికి వచ్చి 15 నుంచి 20 రోజుల్లో పంట కోతకు వస్తాయి. ఇటువంటి పరిస్థితుల్లో కాలువ శివారు ప్రాంతాలైన మత్స్యపురి, బొబ్బనపల్లి ,బాలేపల్లి, వీరవాసరం తదితర ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో సాగునీరు అందడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొణితివాడ, రాయకుదురు, తోలేరు ,పంజా వేమవరం, తోకలపూడి, అండలూరు, చింతలకూటిగరువు నడపన వారి పాలెం, వీరవల్లి వారి పాలెం తదితర గ్రామాల ద్వారా వెళ్లే పంట కాలువలకు వంతులు వారి విధానం ద్వారా సాగునీరు అందిస్తున్నారు. వంతులు వారీగా వస్తున్న సాగునీరు పూర్తిస్థాయిలో వరిచేలకు సరిపడడం లేదని రైతులు వాపోతున్నారు. ఒకపక్క సాగునీరు పరిస్థితి ఇలా ఉంటే, మరో పక్క వరి పంటపై చీడపీడలతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. వరి పంటపై దోమపోటు, మాగుడు తెగులు, ఊచపోటు తదితర చీడపీడలతో పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీడపీడల నివారణకు పెద్ద మొత్తంలో మందులను పిచికారి చేయాల్సి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు .అధిక మోతాదులో చీడ, పీడల నివారణకు మందు పిచికారి చేయడం ద్వారా ఆర్థికంగా ఖర్చులు పెరిగిపోతున్నాయని, పంట దిగుబడి నష్టంతో పాటు ఆర్థికంగా నష్టం వాటిల్లుతుందని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

ఉపాధి హామీ కూలీలపై తేనెటీగల దాడి


తేనెటీగల దాడిలో గాయపడ్డ కూలీ

పాలకోడేరు: మండలంలోని మోగల్లు గ్రామంలో సోమవారం ఉపాధి కూలీలు పంట కాలువలో పని చేస్తున్న సందర్భంలో చెట్ల పొదల్లో ఉన్న తేనెపట్టు చెలరేగి ఈగలు కూలీలపై దాడి చేశాయి. ఈ దాడిలో నలుగురు కూలీలు గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన నేతల ఏసోబును, ఎస్.రాములమ్మ, కుడిపూడి మంగ, బుంగ యోహానును సిబ్బంది పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సకాలంలో వైద్యాధికారి వైద్యం అందించడంతో బాధితులు ఉపశమనం పొందారు . విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీలో పని చేసిన కూలీలకు 15 రోజుల్లో వేతనం ఇస్తున్నామని అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జిల్లా అధికారులు స్పందించి వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పే స్లిప్పులు ఇవ్వాలని జాబ్‌కార్డులు ప్రభుత్వమే అందించాలని డిమాండ్ చేశారు.

ఎస్ఆర్‌కేఆర్‌లో క్రక్స్ 2025 కాంటెస్ట్

భీమవరం: ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏప్రిల్ 4వ తేదీన ఐటీఈ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో క్రక్స్ 2025 కాంటెస్ట్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు చెప్పారు. సోమవారం కాంటెస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్‌రంగరాజు, ఈసీఈ ఇన్‌చార్జ్ హెడ్ జీవీఎస్ పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

భీమవరం: పట్టణంలోని మెంటేవారి తోటలో పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఈ నెల 25వ తేదీన చిన్న పిల్లలకు ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అల్లూరి సీతారామ రాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ చైర్మన్ బి.బలరాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాంపులో ఉచితంగా 2డీ ఎకో టెస్ట్ నిర్వహించి రోగులను గుర్తించి, ఉచితంగా శస్త్ర చికిత్స అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పీజీఆర్ఎస్‌కు 12 అర్జీలు

ఆకివీడు: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు సోమవారం 12 అర్జీలు అందినట్లు ఎంపీడీఓ సుహాసిని చెప్పారు. పట్టణంలోని నాన్ లేఅవుట్లు ఎన్ని ఉన్నాయి, ఎంతమంది ఫీజులు చెల్లించారు, ఎన్ఓసీలు ఎంతమందికి ఇచ్చారు. స్టాంప్సు అండ్ రిజిస్ట్రేషన్‌లో 486బై1లో ఎకరం ఉంటే 2 ఎకరాల 79 సెంట్లు రిజిస్ట్రేషన్ ఎలా అయింది. హౌసింగ్ కాలనీలో ఎంత మందికి ఇళ్లు ఇచ్చారు. ఎంత మంది నిర్మించారనే సమాచాం ఇవ్వాలని మోరా రామిరెడ్డి అర్జీ ఇచ్చాడన్నారు. మండలంలోని అజ్జమూరులో టర్నింగ్ వద్ద ప్రభుత్వ భూమి ఆక్రమించి నిర్మాణం చేయడం వలన వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, ఆ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామానికి చెందిన వర్దినేని వీర వెంకట సత్య శ్రీరామ చంద్రమూర్తి అర్జీ చేశాడన్నారు. అజ్జమూరు గరువు సమీపంలో ఆకివీడు పట్టణ పరిధిలోని వీధి దీపాలు వెలగడంలేదని గతంలో ఫిర్యాదు చేశామని, నాసిరకం దీపాలు వేయడం వల్ల త్వరగా పాడైపోయాయని ఫిర్యాదు చేశారన్నారు. తన భార్య వర్దినేని శేషకల్యాణి పేరున ఉన్న హెచ్‌పీ గ్యాస్ సిలెండర్‌ను ఉచిత పథకంలో ఎమ్మార్కే ఏజెన్సీలో తీసుకున్నామని, నేటికీ ఉచిత సొమ్ము పడలేదని ఫిర్యాదు చేశారని ఎంపీడీఓ తెలిపారు. అయిభీమవరం గ్రామానికి చెందిన కనుమూరు వెంకట రాణి తన భూమిని సర్వే చేయించాలని ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీఓ వివరించారు. మార్చి 24న స్పందన కార్యక్రమంలో ఇచ్చిన ఫిర్యాదుకు సమస్య పరిష్కారం కాలేదని, సరిహద్దుదారుడు తప్పుడు సమాచారం ఇచ్చి, మిమ్మల్ని మోసం చేశారని, దీనిపై విచారణ చేసి పోలీసు కేసు పెట్టాలని కనుమూరు వెంకట్రాజు ఫిర్యాదు చేశారన్నారు.

ప్రేమ పేరుతో మోసం.. యువతి ఫిర్యాదు

భీమవరం: ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసి, ఇప్పుడు ముఖం చాటేస్తున్నాడంటూ భీమవరం పట్టణానికి చెందిన ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇందుకు సంబంధించి ఫిర్యాదుదారు తెలిపిన వివరాలను సీఐ ఎం.నాగరాజు తెలిపారు. బాధితురాలు పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నప్పటి నుంచి జి.ఉదయ్ వెంటపడేవాడని, ఇంజినీరింగ్ పూర్తి చేశాక ఉద్యోగం వచ్చిన వెంటనే పెళ్లి చేసుకుంటానని చెప్పాడన్నారు. సచివాలయం, పంచాయతీల్లో పని చేశాడని. బాధిత యువతి పుట్టిన రోజున పట్టణంలోని ఓ హోటల్‌కు తీసుకెళ్లి బలవంతం చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే తనను పెళ్లి చేసుకునేందుకు అతడి తల్లి నిరాకరించడంతో ఈ విషయమై పెద్దల సమక్షంలో మాట్లాడినా పట్టించుకోలేదని ప్రేమ పేరుతో మోసగించిన ఉదయ్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

దస్తావేజులు పోయినవి

[illegible] ... 5667/2012 ... 5377/2015 ... 06.12.2012 ... 5656/2012 ... 22.03.2025 ... [illegible]

గంధం సంధ్య, భీమవరం, ఫోన్ : 83413 72296

ప్రకటన

నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ భీమవరం బ్రాంచి వారు వారిచ్చిన సంజాయిషీ ప్రకారం శ్రీ [illegible] వెంకట సాయికుమార్ తండ్రి వెంకటేశ్వరరావు మార్టిగేజ్ చేయడానికి అంగీకరించారు. సదరు ఆస్తిపై ఏ విధమైన అభ్యంతరాలు ఉన్నా ఈ ప్రకటన వెలువడిన వారం రోజులలో తెలియజేయవలెను. తరువాత వచ్చిన అభ్యంతరములు స్వీకరించ బడవు. భీమవరం సబ్ రిజిస్ట్రార్ డాక్యుమెంట్ నం. 647/2021 భీమవరం మండలం కొమరాడ గ్రామానికి చెందిన ఆర్.యస్.నం.301/4ఎ లో 580-8 చ.గ. స్థలానికి హద్దులు: తూర్పు: [illegible] పడమర: [illegible] కళ్యాణకుమార్ భూమి. ఉత్తరం: షేక్ సత్తార్ సాహెబ్ భూమి. దక్షిణం: నా క్లయింట్ భూమి

పి.డి.యస్.వి.బాలాజీ, బి.కాం,బి.ఎల్.
అడ్వకేటు,పాలకొల్లు,సెల్ : 9490433732

PUBLIC NOTICE

Notice is hereby given to the Public that the Memorandum of Understanding has executed on 10.02.2025 heretofore subsisting between Smt. Manjula Vallal and Smt. Jhansi Buddaraju , Sri.Tirumani Ashok Chakravathi, carrying on the business of run the school as franchise name and style of "M/s. WESTFIELD INTERNATIONAL SCHOOL", Undi Road, Bhimavaram, Andhra Pradesh of all kind of guidance for academic under IGCSE Curriculum with necessary infrastructure support, Teacher & Staff recruitment, admissions, digital and physical marketing and other technical etc. at Bhimavaram, Andhra Pradesh under the name and style of " WESTFIELD INTERNATIONAL SCHOOL", **stands dissolved and withdraw all services and the Logo/brand /school name"** WESTFIELD INTERNATIONAL SCHOOL" Undi Road, Bhimavaram, Andhra Pradesh with effect from **31st of March,** 2025. Henceforth the 1) Smt. Jhansi Buddaraju, 2) Sri.Tirumani Ashok Chakravathi now running the school under the name "M/s. WESTFIELD INTERNATIONAL SCHOOL" at Undi Road, Bhimavaram, Andhra Pradesh are no longer allowed and are forbidden to use and continue our name "M/s. WESTFIELD INTERNATIONAL SCHOOL", Kondapur, Hyderabad from this date i.e., **31.03.2025.** As such any person and/or persons dealing with the above School name shall do it at his or her own risk and costs.

Sd/- Vikas chand, N. A. Jairaj
Advocates,
D. No.112, 1st Floor, Happy Trade Centre
S D. Road, Secunderabad-500003
Cell No: 9247429065, 9395311389